చిన్నకథ



# బుద్ధి

పచ్చని చెట్ల మధ్యన గువ్వలా ఒదిగిన మా వూర్లో వుంది చిన్న గుడి. గుడికి అటు వైపున బడి ఉంది. ఆ బడికి ఇవతలే మా ఇల్లు. మా ఇంటి పక్కనే సీతమ్మ ఇల్లు. సీతమ్మ ఇంటకి ఎదురుగా రాజమ్మ ఇల్లుంది. పోతే -ఒక్కసారిగా వాతావరణంలో పెద్ద మార్పు వచ్చింది! పిల్లలు పెద్దలూ కొత్త బట్టలు ధరించి ఆనందంగా హడావుడిగా తిరుగుతూ వున్నారు. గుడిలో హడావుడిగా వుంది. దేవుడికి దణ్ణం పెట్టి తీర్థ ప్రసాదాలు తీసుకుని, తృప్తిగా వెనుదిరుగుతున్నారు జనాలు. మా ఇంట్లో గూడా హడావుడిగా వుంది. వంట గదిలో నుండి కమ్మని వాసనలు వస్తున్నాయి. మా ఆవిడది అమృత హస్తం. పండగకి పిండి వంటలతో పాటు పాయసం చేస్తోంది. యాలకులు, వేయించిన జీడి పలుకులు కలిసిన ఆ పాయసపు వాసన, రుచి ఆఘ్రాణించి, ఆస్వాదించాలేగాని చెప్పటానికి మాటలు చాలవు-అనాలిమరి.

ఆ క్షణాన నాకు మా అమ్మ గుర్తుకు వచ్చింది. అందర్లోకి నేను చిన్నవాడిని. మా నాన్న నా చిన్నప్పుడే పోయారు. మా గురించి అమ్మ ఎన్నో కష్టాలు పడింది. అవమానాలు భరించింది. త్యాగాలు చేసింది. ఎంతో చేసింది మాకోసం. ఎన్నో ఇచ్చింది. ఆమె ఆప్యాయతకి అనురాగానికి కొలత లేదు. ఆమె బిడ్డలమయిన మేమందరం ఇప్పుడు ఎంతో బాగున్నాము. అందుకు ప్రధానంగా ఆవిడే కారణం. అయినా ప్రతిగా ఆమెకి మేమే, ఏమీ ఇవ్వలేకపోయాము. మా నుండి ఏమీ పుచ్చుకోకుండానే పాపం మా అమ్మ వెళ్లిపోయింది. ఆ వెలితి నన్ను ఇప్పటికీ పుండులాగా సలుపుతూనే వుంటుంది.

'నేను అలా వెళ్లి వస్తాను' అని లోపలికి కేక వేశాను. మా ఆవిడ ఒక సంచి తీసుకుని వచ్చి అందించింది. నేను తిన్నగా సీతమ్మ గారి ఇంట్లో చొరబడ్డాను.

సీతమ్మగారికి నలుగురు కూతుర్లు. అందరికీ స్థితిమంతమైన సంబంధాలు వచ్చాయి. రాజమ్మ మా వూర్లోనే వుంటుంది. మిగతా ఆడపిల్లలు పొరుగూర్లో వుంటారు. ఆఖర్న సత్యం పుట్టాడు. ఆలోగా ముసలాయన పోయాడు. అప్పటికి సంసారం చితికి పోయింది. పట్నంలో చిన్న ఉద్యోగం చేస్తూ ఇప్పుడు గంపెడు సంసారంతో ప్రపంచాన్ని ఈదుతున్నాడు సత్యం. ఎప్పుడూ సత్యం మా వూరు రాడు. సీతమ్మగారికి కొడుకుని చూడాలని కొండంత కోరిక. ఆడపిల్లలుగాని, మగపిల్లవాడుగాని ఎవ్వరూ ఆవిడ కోరికని తీర్చటానికి ఆసక్తి కనపరచరు! అది ఆమెకి భగవంతుడు ఇచ్చిన శాపం. నేను అప్పుడప్పుడు పని మీద పట్నం వెళ్లినప్పుడు సత్యాన్ని కలిసి, ఆ కబుర్లు సీతమ్మగారికి చెపుతూ వుంటాను. అది నాకు కొండంత తృప్తినిస్తుంది. ఆ కబుర్లు ఆమెకీ కొండంత బలాన్నిస్తాయి.

అరుగు మీద కూర్చుని భగవద్గీత చదువుకుంటున్న సీతమ్మగారు నన్ను చూసి సంతోషంగా 'రా. అయ్యా. రాకూర్చో' అంది.ఆవిడ సంతోషం చూసి నాకు ఎంతో ఆనందం అన్పించింది. ఆవిడ్ని చూస్తే నాకు మా అమ్మ జ్ఞాపకం వస్తుంది. ఆవిడ అడగ్గా-నేను సత్యం గురించి గొప్పగా చేసి వార్తలు చెప్పాను. ఆవిడ ఎంతో సంతోషించగా నేనూ సంతోషించాను. సంచిలోంచి 'పాయసం గిన్నెని తీసి అందించాను. ఆనందంగా ఆరగించింది. కొత్త చీర ఆమె చేతుల్లో పెట్టి వంగి నమస్కరించాను. ఆమె- 'పది కాలాల పాటు పిల్లా పాపలతో సుఖ శాంతులతో వర్ధిల్లు నాయనా' అని ఆశీర్వదించగా అది మా అమ్మ ఆశీర్వాదం లాగ తీసుకున్న నాకు ఎంతో తృప్తిగా అన్పించింది. కాసేపుండినాక నేను గుడికి బయలుదేరాను. నా చేతుల్లో చిన్న పొట్లం వుంచింది, ఆమె. 'బాబూ.ఇందులో నేను ఇన్నాళ్లూ అపురూపంగా దాచుకున్న 'నానుతాడు' వుంది. ఈసారి పట్నం వెళ్లినపుడు దీన్ని మా సత్యానికి ఇవ్వు' అంది.అలాగేనని తల వూపిలేచాను- పొట్లం జేబులో పెట్టుకుని.

గుడికి వెళ్లి దణ్ణం పెట్టుకుని నేను తిరిగి వస్తూవుండగా, సీతమ్మగారి ఇంట్లోంచి బయటకు వస్తూ రాజమ్మ ఎదురయ్యింది. ఆమె చేతుల్లో నేను పండక్కని సీతమ్మగారికి పెట్టిన చీర వుంది! రాజమ్మ ధుమధుమలాడ్తూ-'మా అమ్మకి బుద్ధిలేదు.'అంది. నేను ఆశ్చర్యంగా ఏమయిందన్నాను. 'అమ్మా! పండగ కదా! పెట్టుకుని తిరిగి ఇస్తాను. నాంతాడు ఇవ్వవే- అన్నానా? ఎక్కడో పోయిందట! పది తులాల బంగారం! నిజంగా మా అమ్మకి బుద్ధి లేదు.' అని గట్టిగా నిర్ధారించింది రాజమ్మ, నిర్లజ్జగా. ''ఔన్నిజం రాజమ్మా. మనలాంటి దరిద్రపు లక్షణాలు కలిగిన పిల్లల్ని కన్న ఈ అమ్మలకి బుద్ధి వుందని, బుద్ధి వున్న ఏ పెద్ద మనిషి అనగలడూ''-అనుకున్నాను. నన్ను దాటి విసురుగా చేతిలోని కొత్తచీరని వూపుకుంటూ, తన ఇంట్లోకి చొరబడింది రాజమ్మ.

– పాలడుగు వెంకటేశ్వరరావు